## క్లుప్తంగా

### 7న మండల సమావేశం

మైదుకూరు : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 7న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కేవీ శ్రీధర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో మండల అభివృద్ధిపై సమీక్ష చేస్తారన్నారు. సమావేశానికి సభ్యులతోపాటు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

### బాధ్యతల స్వీకరణ



సీఐ సదాశివయ్య

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ సీఐగా యు.సదాశివయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ యుగంధర్ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు బదిలీ అయ్యారు. సదాశివయ్య గతంలో జిల్లాలోని ఎర్రగుంట్ల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు అర్బన్, రూరల్ పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. ప్రస్తుతం తిరుపతి పీటీసీలో పనిచేస్తూ బదిలీపై ప్రొద్దుటూరు టూటౌన్‌కు వచ్చారు.

### విద్యార్థినులను వేధించిన వారిని శిక్షించాలి

ప్రొద్దుటూరు : విద్యార్థినులను లైంగికంగా వేధించిన వారిని కఠినంగా శిక్షించాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బద్వేల్‌లోని ప్రైవేటు పాఠశాలల్లో సంఘటన మరువకముందే మరో సంఘటన జరగడంపై విద్యా శాఖాధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. ఏవీఆర్ స్కూల్‌లో కంప్యూటర్ టీచర్ విద్యార్థినులను లైంగికంగా వేధించడం దారుణమని పేర్కొన్నారు. వేధింపులకు పాల్పడిన వారిపై ఫోక్సో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### కరువు మండలంగా ప్రకటించాలి

రాజుపాళెం : వాతావరణం అనుకూలించక రైతులు సాగు చేసిన పంటలకు దిగుబడి రాకపోవడంతో రాజుపాళెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు కానాల బలరామిరెడ్డి అన్నారు. విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షపాతం అంతంత మాత్రమే నమోదు కావడం, ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు దిగుబడి సక్రమంగా రాలేదన్నారు. రాజుపాళెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు.

### నేడు విద్యుత్ అంతరాయం

చాపాడు : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ట్రాన్స్ కో ఏఈ కిరణ్మయి తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా చాపాడు, గుంతచీపాడు, చాపాడు రూరల్, ఖాదర్‌పల్లె, పల్లవోలు ఫీడర్లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

### హార్టికల్చర్ అసిస్టెంట్‌కు మెమో

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లె హార్టికల్చర్ అసిస్టెంట్ పవన్‌కుమార్‌కు శుక్రవారం మెమో జారీ చేసినట్లు ఎంపీడీవో ముకుందరెడ్డి తెలిపారు. గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేసిన సమయంలో అతను గత 4 రోజుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్నట్లు గుర్తించినట్లు ఆయన తెలిపారు. తక్షణమే సంజాయిషీ ఇవ్వవలసినదిగా ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

### నేడు బాబూ జగజ్జీవన్‌రాం జయంతి

పులివెందుల : పట్టణంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో శనివారం బాబూ జగజ్జీవన్‌రాం జయంతి సందర్భంగా నివాళులర్పించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలు పాల్గొంటారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ఎంఆర్‌పీ ధరకే విక్రయించాలి

కమలాపురం : యూరియా తదితర ఎరువులు ఎంఆర్‌పీ ధరకే విక్రయించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుకాణదారులు చట్టంకు లోబడే వ్యాపారం చేయాలన్నారు. స్టాక్ రిజిష్టర్, బిల్ బుక్, స్టాక్ బోర్డు తప్పని సరిగా షాప్‌లో ఏర్పాటు చేయాలన్నారు. అలాగే స్టాక్ రిజిష్టర్‌కు, ఎరువుల నిల్వలకు వ్యత్యాసం లేకుండా చూడాలన్నారు. పురుగు మందుల డీలర్లు ప్రభుత్వం ద్వారా అనుమతి పొందిన పురుగు మందులు మాత్రమే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు సరస్వతి, శ్యాంబాబు, కమలాపురం, వల్లూరు, వీఎన్‌పల్లె, ఎర్రగుంట్ల మండలాల ఎరువుల, పురుగు మందుల, విత్తనాల దుకాణదారులు పాల్గొన్నారు.

### ఇరువురు అరెస్టు

ముద్దనూరు : కొర్రపాడులోని శ్రీ చెన్నకేశవ ఆలయంలో 3 రోజుల క్రితం జరిగిన చోరీ యత్నం కేసులో శుక్రవారం ఇరువురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన మస్తాన్‌తో పాటు మరో బాలుడిని అరెస్టు చేసినట్లు, అరెస్టయిన మైనర్‌ను కడప జువైనెల్ హోంకు తరలించగా, మరో నిందితున్ని జమ్మలమడుగు కోర్టు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

# రైతన్నకు అడుగడుగునా అవాంతరాలు

- ఈదురు గాలులకు దెబ్బతిన్న అరటి, బొప్పాయి, సజ్జ, వరి పంటలు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- ఆందోళనలో రైతాంగం

కాశినాయన : ఆరుగాలం కష్టపడి పంటలు పండించే అన్నదాత అడుగడుగునా అవాంతరాలు ఎదుర్కొంటున్నాడు. ఒక పక్క అతివృష్టి మరో పక్క అనావృష్టి, చీడపీడలు, నకిలీ విత్తనాలు నట్టేట ముంచుతున్నాయి. దీనికి తోడు అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయి. మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వాటి శబ్దాలకు ప్రజలు భీతిల్లిపోయారు. మండలంలోని ఆకులనారాయణపల్లె, సావిశెట్టిపల్లె, వరికుంట్ల, కె.ఎస్.కొట్టాల, పాలగిరి గ్రామాల్లో రైతులు సాగు చేసిన దాదాపు 400 ఎకరాల్లో కోతకు వచ్చిన అరటి పంట గాలికి నేలమట్టమైంది. ఉద్యాన అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపిన వివరాల మేరకు పోరుమామిళ్ల ఉద్యాన సంచాలకులు పరిధిలోని కాశినాయన, బి.మఠం మండలాల్లో 900 ఎకరాల్లో అరటి, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం రైతులకు రూ.18 కోట్లు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. శనివారం క్షేత్రస్థాయిలో రైతుసేవా కేంద్ర సిబ్బంది నష్టపోయిన పంటలను పరిశీలించి నివేదికలు తయారు చేస్తామని తెలిపారు. కత్తెరగండ్ల, ఉప్పలూరు, రంపాడు, నరసాపురం గ్రామాల్లో 200 ఎకరాల్లో సజ్జ, 45 ఎకరాల్లో సాగు చేసిన వరిపంట దెబ్బతిన్నట్లు గుర్తించామని వ్యవసాయాధికారి జయలక్ష్మి తెలిపారు. శనివారం క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి నివేదికలు తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. నరసాపురంలో పెనుగాలులకు 6 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ అధికారులు హుటాహుటిన సాయంత్రానికి విద్యుత్‌ను పునరుద్ధరించారు. అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.



నరసాపురంలో గాలికి నేలకొరిగిన విద్యుత్ స్తంభం



వరికుంట్లలో పెనుగాలులకు నేలవాలిన అరటి పంట



రెడ్డికొట్టాలలో గాలికి పడిపోయిన సజ్జ పంట



నరసాపురంలో నేలకొరిగిన వరిపంట

### నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : బద్వేలు నియోజకవర్గంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షంతో వందలాది ఎకరాల్లో అరటి తోటలు నేలమట్టమయ్యాయని, పొగాకు పంటలు తడిసి ముద్దయ్యాయని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉరుములు, వడగండ్లు, గాలులకు సజ్జ, వరి తదితర చేతికొచ్చిన పంటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దీంతో రైతుల బాధలు వర్ణనాతీతంగా ఉందన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు చేతికందకుండా పోయాయన్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం స్పందించి అధికారుల ద్వారా నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ఇన్సురెన్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

### గంజాయి సీజ్

పులివెందుల : పట్టణంలోని స్థానిక కోతి సమాధి సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం మల్లికార్జున అనే యువకుడిని అదుపులోకి తీసుకుని కేజీ ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పులివెందుల అర్బన్ సీఐ నరసింహులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో గంజాయితో పాటు పట్టుబడిన వ్యక్తిని మీడియా ఎదుట సమావేశపరిచారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ మాట్లాడుతూ చిన్నరంగాపురం గ్రామానికి చెందిన చట్టా మల్లికార్జున జల్సాలకు అలవాటు పడి పులివెందులలో కొంతమంది దగ్గర తక్కువ ధరలకు గంజాయి కొనుగోలు చేసి ఎక్కువ రేటుగా అమ్ముకొని లాభం గడిస్తూ జీవిస్తున్నాడన్నారు. గంజాయి నియంత్రణకు తల్లిదండ్రులు, ప్రజలు సమాచారమిచ్చి సహకరించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్ట

కొండాపురం : పెంజిఅనంతపురం సమీపం నీల మల్లేశ్వరస్వామి కోన దేవస్థానంలో నూతనంగా నిర్మించిన వీరభద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం ధ్వజ స్తంభ, విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. వేదపండితులతో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### కేజీబీవీలో ప్రవేశాలకు ఉపాధ్యాయుల ప్రచారం

సింహాద్రిపురం : స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులు చేరేందుకు ప్రజలకు అవగాహన కల్పించేలా పోస్టర్లను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ 2 ప్రభుదాస్ మాట్లాడుతూ 6వ, 11వ తరగతులలో చేరేందుకు, 7, 8, 9, 10, 12వ తరగతులలో మిగిలిన సీట్లను భర్తీ కోసం విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బడి ఈడు పిల్లలు, బడి మానేసిన పిల్లలు, పేదలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందినవారు అర్హులన్నారు. ప్రవేటు పాఠశాలల కాలేజీలకు దీటుగా అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు.

## దళితవాడ దప్పిక తీరేదెన్నడు?

- నెలలు గడుస్తున్నా పరిష్కారం కాని వైనం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



ట్యాంకర్ వద్దకు వెళ్ళి నీటిని తెచ్చుకుంటున్న స్థానికులు

గోపవరం : మండలంలోని ఎస్.రామాపురం దళితవాడలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించరా? అని స్థానికులు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తున్నారు. నెలల తరబడి తాగునీటి సమస్య ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంత వరకు పట్టించుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దళితవాడలో 70 కుటుంబాలు ఉండగా తాగునీటి కోసం ఓవర్‌హెడ్ ట్యాంకు ఏర్పాటు చేశారు. పథకానికి సంబంధించిన బోరు ద్వారా సుద్దనీరు వస్తుందని, ఆ నీటిని తాగలేకపోతున్నామని, అంతేకాకుండా సంబంధిత బోరు తరచూ కాలిపోతుందని, ప్రత్యామ్నాయంగా మరొక బోరు వేసి తాగునీరు అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై స్పందించిన ఎంపీడీఓ రామనాథరెడ్డి ఇటీవల దళితవాడను సందర్శించి తాగునీటి సమస్యపై స్థానికుల ద్వారా ఆరా తీశారు. త్వరలోనే నీటి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీఓ తెలిపారు. అయినా ఇప్పటి వరకు సమస్యను పరిష్కరించకపోవడంతో స్థానికులు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. పక్కనే పొలంలో ఉన్న బోరు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గత రెండు రోజులుగా ట్యాంకర్ ఏర్పాటు చేయడంతో ట్యాంకర్ వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ఇంకా ఎన్ని రోజులు ఇలా నీటి కోసం అవస్థలు పడాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దళితవాడలో నెలకొన్న తాగునీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## సమస్యల పరిష్కారానికే రైతు సేవా కేంద్రాలు



మాట్లాడుతున్న అధికారులు నాగరాజ, అంకయ్య

అట్లూరు : రైతుల సమస్యల పరిష్కారానికి రైతు సేవా కేంద్రం ఒక చక్కటి వేదిక అని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ, కడప ఊటుకూరు ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టరు కె.అంకయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దిన్నెమీదపల్లి ఎస్సీ కాలనీలో నూనె గింజల అభివృద్ధి పథకం, జాతీయ భద్రత మిషన్ చిరుధాన్యాలు, పప్పు దినుసులు, నూనెగింజల పంటలు సాగు, సాంకేతిక పద్ధతులు, విలువ జోడింపు, కోత అనంతర యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు అవగాహన కలిగించారు. అలానే రైతులకు యాంత్రీకరణ పథకం ద్వారా 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందజేస్తున్న వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి రైతు రైతు సేవా కేంద్రం ద్వారా విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు. కార్యక్రమంలో బద్వేలు, అట్లూరు వ్యవసాయ అధికారులు చంద్రమోహన్‌రెడ్డి, రామకృష్ణయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్ ధనుంజయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వైఎస్ అవినాష్‌రెడ్డిపై షర్మిల అసత్య ఆరోపణలు



వైఎస్సార్‌సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

చాపాడు : సరస్వతీ పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ షేర్ల బదిలీ విషయంలో తల్లి వైఎస్ విజయమ్మ, చెల్లి షర్మిల మోసం చేసినందునే వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని రద్దు చేసుకున్న వెంటనే.. ఆస్తుల పిచ్చిలో పీసీసీ అధ్యక్షులురాలు షర్మిల కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ వైఎస్ వివేకానందరెడ్డి కేసును పక్కదారి పట్టిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం రెడ్యం వెంకటసుబ్బారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అధికారులను అవినాష్ బెదిరిస్తుంటే, సాక్షులు ఒక్కొక్కరూ చనిపోతుంటే.. అధికారులు, వారి బంధువులు, కుటుంబ సభ్యులు చెప్పాలి గానీ.. అవినాష్ బెయిల్ రద్దు చేయాలని షర్మిల చెప్పడం తగదని అన్నారు. కూటమి అద్దె మైక్‌గా మారిన షర్మిల అధికార పక్షాన్ని విమర్శించకుండా, ప్రతిపక్షంలో ఉన్న జగన్, అవినాష్‌లను విమర్శించడం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

## టీబీ నిర్ధారణకు స్క్రీనింగ్ పరీక్షలు



టీబీ టెస్ట్ దోస్ వేస్తున్న డాక్టర్ హిమబిందు

ప్రొద్దుటూరు క్రైం : జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక వైఎంఆర్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీవై టీబీ నిర్ధారణ పరీక్షలను శనివారం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి స్క్రీనింగ్ టెస్ట్‌లను ప్రారంభించి మాట్లాడుతూ టీబీ స్క్రీనింగ్‌తోపాటు టీబీ పేషెంట్ ఉన్న ఇంట్లో 18 ఏళ్లు దాటిన కుటుంబ సభ్యులందరికీ టీబీ టెస్ట్ డోస్ వేస్తున్నట్లు డాక్టర్ హిమబిందు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ రాజారత్నం, టీబీహెచ్‌వీ.సిద్ధారెడ్డి, ప్రసాద్, సబ్ యూనిట్ అధికారి సాదు శ్రీనివాసులు, సీఓఎంవీ సుబ్బారెడ్డి, హెల్త్ సెక్రటరీ పాల్గొన్నారు.

## అక్రమ రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన అక్రమ రేషన్ బియ్యంతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జీ శ్రీనివాసరావు బృందం

చెన్నూరు(వల్లూరు) : మండలంలోని ఉప్పరపల్లి సమీపం గోపవరం నుంచి పొలాల్లోకి వెళ్లే దారిలో శుక్రవారం 175 బస్తాల అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ జీ శ్రీనివాసరావు తెలిపారు. తరలించడానికి సిద్ధంగా వున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఉప్పరపల్లెకు చెందిన బ్రహ్మయ్య చుట్టు పక్కల గ్రామాల నుండి బియ్యాన్ని అక్రమంగా సేకరించి రవాణా చేయుటకు సిద్ధంగా ఉంచిట్లు గుర్తించామని తెలిపారు. ఈ తనిఖీలలో 8,575 కిలోల బరువు ఉన్న 175 బస్తాల రేషన్ బియ్యాన్ని వాహనంతోపాటు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాహనముతో పాటు వాటి విలువ సుమారుగా రూ 6,94,450 వుంటుందన్నారు. వాటిని కడప సీఎస్‌డీటీ పీఎంవీ మనోజ్‌కు అప్పగించినట్లు తెలిపారు. బ్రహ్మయ్యతోపాటు వెంకటసుబ్బయ్య అనే వ్యక్తిపై చెన్నూరు పోలీస్ స్టేషన్‌లో 6ఏతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు శివన్న, కడప ఏవో బాలగంగాధరరెడ్డి, సీఎస్‌డీటీ మనోజ్, ఆర్ఐ కౌశిక్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద నిరసన





నిరసన తెలుపుతున్న విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల నాయకులు

ప్రొద్దుటూరు : ఉప విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. నాయకులు కత్తి ఓబులేసు, గడ్డం నరసింహులు, ప్రతాప్‌రెడ్డి, జగన్, జయరాజు మాట్లాడుతూ ప్రొద్దుటూరు ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయం పరిధిలో 16 మండలాలు ఉన్నాయన్నారు. ఆయా మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను విద్యాశాఖాధికారి విజిట్ చేసిన దాఖలాలు లేవన్నారు. సమస్యలకు చెప్పుకోవడానికి వచ్చినప్పుడు వారిపై ఆ అధికారి ఆగ్రహం వ్యక్తం చేస్తూ చులకనగా చూస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్నా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న ఆ విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బయన్న, దాసు, శ్రవణ్, రవి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఎంవీఆర్ జయంతి



రక్తదానం చేస్తున్న ఉమా మురళీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని లింగాపురంలోని రాయలసీమ వ్యాయామ విద్య కళాశాలలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎంవీ.రమణారెడ్డి జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో ఎంవీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సురక్ష రక్తనిధి సంస్థ సహకారంతో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో కరస్పాండెంట్ మల్లెల ఉమా మురళీధర్‌రెడ్డి రక్తదానం చేసి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారు. ఉమా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంవీఆర్ ఆశయాలను, ఆలోచనలను ముందుకు తీసుకెళుతున్నామన్నారు. రాయలసీమ వాసులకు వ్యాయామ విద్య అందించేందుకు 1984లో రాయలసీమ వ్యాయమ విద్య కళాశాల స్థాపించారని తెలిపారు. అనంతరం ఎంవీఆర్ కుమారుడు మల్లెల రాజారాంరెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్ పర్సన్ మల్లెల ఝాన్సీరాణి ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సీఐ గోవిందరెడ్డి భోజనం వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మల్లెల మురళీధర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రవిశంకర్, సురక్ష రక్తనిధి కేంద్రం ప్రతినిధి ఓబుళరెడ్డి, సునీల్, లాయర్ సుమంత్, ఈశ్వర్‌రెడ్డి, వేణు, రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లాలోని పలు మండల పార్టీ కమిటీలను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

**మైదుకూరు రూరల్ పార్టీ కమిటీ**

ఉపాధ్యక్షులుగా ఎ.అబ్దుల్ కలాం, ప్రధాన కార్యదర్శులుగా ఎ.రామసుబ్బారెడ్డి, సి.వెంకట సుబ్బారెడ్డి, వి.హరినాథ్; కె.సుబ్బరామిరెడ్డి, కార్యదర్శులుగా ఆర్.నాగూర్‌రెడ్డి బి.నరసింహానాయక్, బి.వీరారెడ్డి, సుధాకర్, వై.పెద్దయ్య, సభ్యులుగా నాగరాజు, టి.శ్రీకాంత్, ఎం.సుబ్రమణ్యం, ఎం.వెంకోజీరావు, కె.నాగేంద్ర, పి.రామయ్య, కె.గురుశేఖర్, వై.షరీఫ్, ఇ.సుబ్బారెడ్డి, ఎం.నాగిరెడ్డి, ఎం.సురేంద్రారెడ్డి, సయ్యద్‌బాషా, ఇ.నాగేశ్వరరావులను నియమించారు.

**చాపాడు మండల పార్టీ కమిటీ**

ఉపాధ్యక్షులుగా జి.రమణయ్య, బి.రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా వి.లక్ష్మీసాయిరెడ్డి, ఎ.లక్ష్మిరెడ్డి, డి.అఖిలేష్, కార్యదర్శులుగా ఎల్.శ్రీకాంత్‌రెడ్డి, వై.తాజుద్దీన్, పి.విశ్వనాథరెడ్డి, ఎం.గురుశేఖర్‌రెడ్డి, జి.రాజు, పి.వెంకట్రామిరెడ్డి, సభ్యులుగా జి.శ్రీనివాసులు, ఎన్.నందారెడ్డి, జీవై వీరారెడ్డి, టి.రమాదేవి, జి.బాబక్క, ఎం.జయరాజు, టి.ఓబులేశు, పి.ప్రకాశ్‌యాదవ్, కె.ఓబులేశు, కె.గంగాధర్, పి.గురుదేవి, ఎ.వెంకట రామయ్య, పి.యారవ మన్సూర్, పి.బాలమ్మ, ఎస్.అశోక్‌లను నియమించారు.

**దువ్వూరు మండల పార్టీ కమిటీ**

ఉపాధ్యక్షులుగా టి.వెంకటసుబ్బారెడ్డి, జి.మోహన్, ప్రధాన కార్యదర్శులుగా జి.గురివిరెడ్డి, కె.నాగసుధాకర్‌రెడ్డి, ఆర్.రమేష్‌యాదవ్, జె.గోవిందరెడ్డి, కార్యదర్శులుగా బి.మహబూబ్‌బాషా, ఎస్.శ్రీకాంత్, చెంద్రాయుడు, వై.రవీంద్రారెడ్డి, పి.శ్రీనివాసులురెడ్డి, సభ్యులుగా సి.పార్థసారథిరెడ్డి, జె.రాజు, ఎం.విజయభాస్కర్‌రెడ్డి, పి.రాజయ్య, కె.రామమునిరెడ్డి, మాదిరెడ్డిరెడ్డి, పి.నసీర్‌ఖాన్. ఎ.శ్రీనివాసులు, గురవయ్య, వెంకట సుబ్బారెడ్డి, బి.అతావుల్లా, జి.రామమునిరెడ్డి, ఐ.పద్మనాభరెడ్డి, డి.రామయ్య, ఎం.రసూల్‌గౌస్, బి.శివనాగరాజు, సి.అరుణ్‌కుమార్‌రెడ్డిలను నియమించారు.

**ఖాజీపేట మండల పార్టీ కమిటీ**

ఉపాధ్యక్షులుగా కె.ముజీబుర్ రెహ్మాన్, టి.అమరేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా టి.రామిరెడ్డి, ఎం.రామసుబ్బారెడ్డి, వి.వేమారెడ్డి, ఎం.సుధాకర్, కార్యదర్శులుగా కె.వేణుగోపాల్‌రెడ్డి, ఎం.బుజ్జి, డి.గంగాదనం, కె.ఓబులేశు, పి.ఓబుల్‌రెడ్డి, సభ్యులుగా హఫీజుల్లా, ఎస్.సుధాకర్, రామకృష్ణారెడ్డి, ఎస్.చెన్నకేశవరెడ్డి. బి.రాముడు, డేవిడ్ ఓబయ్య, సి.చలమారెడ్డి, జీసీ జయరామిరెడ్డి, జి.రామసుబ్బారెడ్డి, జి.సుబ్బారెడ్డి, డి.రాముడు, వై.దేవరాజు, ఇ.జీవన్‌కుమార్, మదీనబాషా, వై.అంజి, ఎం.సుబ్రమణ్యం యాదవ్‌లను నియమించారు.

**బి.మఠం మండల పార్టీ కమిటీ**

ఉపాధ్యక్షులుగా బి.దుగ్గిరెడ్డి, సి.కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా కె.రాజశేఖర్‌రెడ్డి, ఎస్.రామగురివిరెడ్డి, కె.నాగరాజు, బి.బాలిరెడ్డి, కార్యదర్శులుగా టి.నాగార్జున, బి.రమణారెడ్డి, ఎస్.సిద్ధారెడ్డి, పి.రవిశంకర్‌రెడ్డి, వి.శంకర్‌రెడ్డి, సభ్యులుగా ఓ.రమణయ్య, ఎస్.సాల్మన్‌రావు, బి.వెంకటరమణ, సి.రామ్మోహన్, ఎల్.పెంచల్‌రెడ్డి, ఎస్.బాలస్వామి, ఎస్.ఎరికలయ్య, ఎ.వెంకటనారాయణరెడ్డి, వి.సుభాష్‌చంద్రారెడ్డి, బి.కృష్ణారెడ్డి, డి.నాగసుబ్బారెడ్డి, డి.నరసింహులు, వి.ఓబుల్‌రెడ్డి, బి.సమరసింహారెడ్డి, ఆర్.అమీర్‌బాషా, బి.సుబ్బారెడ్డి, బి.శేషారెడ్డిలను నియమించారు.

## భ్రూణ హత్యలకు పాల్పడితే జైలు శిక్ష

తొండూరు : ఎవరైనా భ్రూణ హత్యలకు పాల్పడితే జరిమానాతోపాటు జైలు శిక్ష విధించడం జరుగుతుందని హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో లింగ వివక్షత నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడు తూ ఆడ పిల్లల శాతం మంగపిల్లల శాతం కంటే తగ్గిపోతుండటం విచాకరమన్నారు. దంపతుల ఆలోచనలో మార్పు రావాలని, అమ్మాయి అని స్కా నింగ్ ద్వారా తెలుసుకుని అక్రమ గర్భస్రావాలు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. సమాజంలో ఆడ, మగ పిల్లలు ఇద్దరు సమానమని, ఆడపిల్లలను చదివిస్తే మంచి ప్రయోజకులై మంచి పేరు తీసుకొస్తారన్నారు. అనంతరం బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం ప్రాధాన్యత గురించి, గర్భస్థ పూర్వ, గర్భస్త పిండ, లింగ నిర్ధారణ పరీక్షల నిషేద చట్టం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సాయిప్రతాప్‌రెడ్డి, మహిళా పోలీసు ప్రవీణ, ఆరోగ్య కార్యకర్త శుక్రూ, అంగన్‌వాడీ సిబ్బంది సుజాత, తేజ, రేవతి, గర్భిణులు పాల్గొన్నారు.

## రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ డి.నిహారిక క్యాన్సర్‌పై అవగాహన, స్క్రీనింగ్ క్యాన్సర్ రోగులను క్రమం తప్పకుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.